పంచారామాలకు ప్రత్యేక బస్సులు

ఏలూరు అర్బన్: కార్తీక మాసం సందర్భంగా పంచారామాలకు ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్.వి.షణ్ముఖం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు ఈ నెల 26, నవంబర్ 2, 9, 16 తేదీల్లో (ఆదివారాలు) ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోల నుండి రాత్రి ఎనిమిది గంటలకు బయలుదేరి సోమవారం రాత్రికి తిరిగి బయల్దేరిన ప్రాంతాలకు చేరుకుంటాయని పేర్కొన్నారు. ఈ సర్వీసులకు జిల్లావ్యాప్తంగా ఒకే టికెట్ ధర ఏర్పాటు చేశామని, ఎక్స్‌ప్రెస్ బస్సులకు రూ.900, అల్ట్రా డీలక్స్ బస్సులకు రూ.1100, సూపర్ లగ్జరీ రూ.1200గా నిర్ణయించినట్లు తెలిపారు. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కలదని, ఇతర వివరాలకు సమీప డిపో మేనేజర్‌ను సంప్రదించాలని సూచించారు. స్పెషల్ ప్యాకేజీపై శబరిమలై ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి శనివారం, ఆదివారం రాత్రి ఎనిమిది గంటలకు శ్రీశైలం ప్రత్యేక బస్సు సర్వీసులు అన్ని డిపోల నుండి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

'నిడమర్రు మండలానికి చెందిన వెంకటేశ్వరరావు కౌలు రైతు. మూడెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఖరీఫ్, రబీ సీజన్‌లో వరి సాగు చేసి ఏడాదిపాటు శ్రమించినా పడిన కష్టం కూడా రాలేదు. మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు, పెరిగిన పెట్టుబడులతో అప్పులే మిగులడంతో.. ఎన్నో ఏళ్లుగా ఆ కుటుంబం పడుతున్న బాధలు వర్ణనాతీతంగా మారాయి'.

'ఇరగవరం మండలానికి చెందిన శ్రీనివాస్ అనే రైతు ప్రతియేటా ఐదెకరాల వరకూ కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఏళ్ల తరబడి వ్యవసాయ సాగు చేస్తున్నా ఇప్పటి వరకూ కూడబెట్టింది ఏమీ లేకుండా పోయింది. పిల్లలను మంచి చదువులు సైతం చదవించలేకపోయాడు. ఆరుగాలం కష్టపడినా పెట్టుబడులు రావడమే గగనంగా మారింది. వ్యవసాయ సాగే జీవనాధారంగా చేసుకున్న ఆ కుటుంబం పరిస్థితి నిత్య పోరాటంగా మారింది'.

కౌలు రైతుల కన్నీటి వ్యథ..!

- వరిసాగులో అత్యంత దారుణ పరిస్థితి
- ఆరుగాలం కష్టపడినా మిగులు శూన్యం
- పెట్టుబడి, కౌలుకే పండిన పంటంతా
- అప్పుల ఊబిలో కౌలురైతులు
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న రైతులు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌లే కాదు. జిల్లాలోని కౌలురైతులు అందరి పరిస్థితి ఇదేవిధంగా ఉంది. వ్యవసాయాన్ని వదల్లేక, అప్పుల బతుకులతో ముందుకు సాగలేక కౌలురైతులంతా నిత్యం నరకం చూస్తున్నారు. ప్రభుత్వ విధానాలు, ప్రకృతి వైపరీత్యాలతో కౌలురైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఆరుగాలం కష్టపడినా ఫలితం లేకుండాపోతోంది. ఏలూరు పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రతియేటా దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. వ్యవసాయ సాగులో 80 శాతం కౌలురైతులే చేస్తున్నారు. ఆహార ఉత్పత్తిలో ఇంతటి కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నాయి. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. ఏడాదంతా కష్టపడినా మూడు పూటల కడుపు నిండే పరిస్థితి లేదంటే అతిశయోక్తి కాదు. వరిసాగులో అత్యధిక దిగుబడి వచ్చిందనుకుంటే ఖరీఫ్‌లో 40 బస్తాలు, రబీలో 50 బస్తా వరకూ ఉంటోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 75 కిలోల బస్తా ధర రూ.1,788 వరకూ ఉంది. అంతా సవ్యంగా నడిస్తే ఈ ధర ప్రకారం 40 బస్తాలకు రూ.71,520 ఆదాయం వస్తుంది. ఎకరాకు పెట్టుబడి రూ.45 వేల వరకూ రైతులు పెడుతున్నారు. డెల్టాలో కౌలు పంటకు 15 నుంచి 17 బస్తాలు ఉంది. ఆ ప్రకారం లెక్కిస్తే రూ.30 వేలు వరకూ కౌలు కిందపోతోంది. కౌలు రూ.30 వేలు, పెట్టుబడి రూ.45 వేలు కలిపితే రూ.75 వేలు అవుతోంది. వచ్చే ఆదాయం మాత్రం రూ.71,520 మాత్రమే. పెట్టుబడి కొంత తగ్గితే అతికష్టంపై ఖర్చులు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు ఏమీ లేకుండా ఉంటేనే ఇదంతా. తుపాన్లు, వరదలు వస్తే రైతులకు ఎకరాకు రూ.20 వేలకుపైగా అప్పులే శరణ్యం. రబీలో రైతు చేసిన సాగులో సరాసరి ఎకరాకు 50 బస్తాలు దిగుబడి వస్తోంది. రబీలో ఖర్చు మరింత ఎక్కువగా ఉంటుంది. రబీలోనూ కౌలు, పెట్టుబడి పోను రైతులకు మిగిలేది దాదాపు శూన్యమే. ఒకవేళ ఎకరాకు నాలుగైదు వేలు మిగిలితే ఖరీఫ్‌లో వచ్చిన నష్టానికి సైతం సరిపోని పరిస్థితి ఉంటుంది.

ఏళ్ల తరబడి సాగు చేస్తున్నా మారని కౌలు బతుకులు

రెండు జిల్లాల్లో లక్షలాది మంది రైతులు ఏళ్ల తరబడి కౌలు వ్యవసాయం చేస్తున్నారు. వాళ్ల బతుకులు ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయి. మంచి ఇల్లు, పిల్లలకు సరైన చదువులు వంటివి సైతం లేని పరిస్థితులు ఉన్నాయి. అప్పుల బాధలు భరించలేక కౌలురైతులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు కోకొల్లలు. ప్రభుత్వాలు మారుతున్నా కౌలురైతుల బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదు. పెట్టుబడి పెడుతున్న కౌలురైతులకు పంటరుణాలుగాని, బీమా పరిహారంగాని ఏమాత్రం అందడం లేదు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి కింద ఏడాదికి ఇచ్చే రూ.ఆరు వేలు, అన్నదాత సుఖీభవ పేరుతో రాష్ట్రప్రభుత్వం ఏడాదికి ఇచ్చే రూ.20 వేలలోనూ కౌలురైతులకు ఇవ్వడం లేదు. రైతుల ఆదుకునేందుకు వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ కమిటీ చేసిన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు. ప్రభుత్వాలు కౌలురైతుల కన్నీటి వ్యథను గురించి ఏమాత్రం ఆలోచించడం లేదు.



వినతిపత్రం అందిస్తున్న వి.శ్రీనివాసరావు, నేతలు, గిరిజనులు

భూసేకరణ నోటిఫికేషన్ సరికాదు

అధికారుల అక్రమాలను అడ్డుకుంటాం

సానుకూలంగా స్పందించకుంటే ఆందోళనలు ఉధతం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

పోలవరం ఆర్ అండ్ ఆర్ కార్యాలయం ఎదుట గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

గిరిజనుల స్వాధీనంలో ఉన్న భూములను పోలవరం ప్రాజెక్టు కోసం భూసేకరణ నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదని, ఈ నోటిఫికేషన్లో అక్రమాలను అడ్డుకుంటామని, గిరిజనుల పోరాటాలకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ అక్రమ నోటిఫికేషన్లను వ్యతిరేకిస్తూ బుట్టాయిగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాల్లోని 20 గ్రామాల గిరిజనులు తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. తొలుత సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ సెంటర్ నుంచి కార్యాలయం వరకూ వారు ర్యాలీగా వెళ్లి కార్యాలయం గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన జరిగిన ధర్నాలో వి.శ్రీనివాసరావు మాట్లాడారు. బుట్టాయిగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాల్లో ఇప్పటి వరకూ భూసేకరణ కోసం ఐదు నోటిఫికేషన్లు ఇచ్చారన్నారు. ప్రతి నోటిఫికేషన్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. కనీసం గ్రామసభలు నిర్వహించకుండానే వీటిని జారీ చేశారన్నారు. గిరిజనుల సాగులో ఉన్న భూములను భూస్వాముల పేరుతో రికార్డుల్లో నమోదు చేశారన్నారు. ఈ అక్రమాలను అడ్డుకుని గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. తాజా నోటిఫికేషన్‌ను పరిశీలిస్తే అక్కడి అధికారులు భూస్వాములతో కుమ్మక్కైనట్టు స్పష్టమవుతుందన్నారు. గిరిజనుల రక్షణ చట్టాలను అమలు చేయడంలో పాలనా యంత్రాంగం విఫలమవుతుందన్నారు. ప్రతి ఎకరాకూ బహిరంగ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు సానుకూలంగా స్పందించకపోతే భవిష్యత్తు కార్యాచరణను గిరిజనులు రూపొందించుకుంటారని, దీనికి సిపిఎం అండగా నిలుస్తుందని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ధర్నా చేపట్టామన్నారు. ఈ సమస్యకు శాంతియుతంగా పరిష్కారం చూపాలన్నారు. ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ గిరిజనులు తమ గోడు వెలిబుచ్చేందుకు తరలొచ్చారన్నారు. పరిష్కారం చూపకుంటే దేనికైనా వారు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.నాగమణి మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో వాగులు, వంకలు పొంగి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. అయినప్పటికీ అన్యాయాన్ని ప్రశ్నించేందుకు గిరిజనులు అడ్డంకులు దాటుకుని ఇక్కడకు వచ్చారన్నారు. ఇది వారి పోరాట పటిమకు దర్పణం పడుతుందన్నారు. న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, బుట్టాయిగూడెం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, పోలవరం మండల కార్యదర్శి కారం భాస్కరరావు, జీలుగుమిల్లి మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పవన్, జువ్వల రాంబాబు తదితరులు పాల్గొన్నారు

గిరిజనులకు న్యాయం చేస్తాం

వి.అభిషేక్, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి

గిరిజనులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనీయబోనని పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి.అభిషేక్ తెలిపారు. ధర్నా వద్దకు ఆయన వచ్చి గిరిజనులతో మాట్లాడారు. వారి వినతులను స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దీంతో గిరిజనులు ఆందోళన విరమించారు.

జోరు వర్షం.. స్తంభించిన జనజీవనం

పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి

ఏలూరు: నీట మునిగిన రోడ్డు

కొయ్యలగూడెం: మండలంలో కురిసిన భారీ వర్షం కారణంగా కన్నాపురం రోడ్డు పూర్తిగా జలమయమైంది. రెండు గంటలపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. మండలంలో 38.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పంటలు నీట మునిగిపోయాయి.

పోలవరం: మండలంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో జనం రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

ముసునూరు: సోమవారం ఉదయం కురిసిన వర్షంతో మండలంలో పలు గ్రామాల్లో రోడ్లపై వర్షపు నీరు చేరింది. దీంతో ఉదయమే విధులకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం వరి పంటకు మేలు చేకూరుస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరంలో సోమవారం ఉదయం నుంచి భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. దీంతో నగరంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. ఆర్‌ఆర్‌పేట, పవర్‌పేట స్టేషన్ రోడ్డు, సెయింట్ థెరిస్సా కళాశాల రోడ్, లో బ్రిడ్జి, వన్‌టౌన్‌లోని విజయలక్ష్మి థియేటర్ వద్ద, చేపల మార్కెట్ ప్రాంతాల్లో మురుగు నీరు మోకాళ్ల లోతు నిలిచింది. మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోబ్రిడ్జిలోకి పెద్దఎత్తున వర్షపు నీరు చేరడంతో దాన్ని మూసివేశారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది.

ఏలూరు: మూతపడిన అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి

జీలుగుమిల్లి: మండలంలో సోమవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. మిర్చి, వేరుశెనగ నాట్లలోకి వర్షపు నీరు చేరింది. వరిచేలు పొట్ట మీద ఉండటంతో నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చింతలపూడి: మండలంలో కురిసిన భారీ వర్షానికి రోడ్లు మొత్తం జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పూడికతో నిండటంతో ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. ముక్కంపాడు, మాలపల్లి గ్రామాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముక్కంపాడు నుంచి ప్రగడవరానికి వెళ్లే మార్గం నీట మునగడంతో ఆ గ్రామం నుంచి బయట అడుగు పెట్టలేని దుస్థితి నెలకొంది. గ్రామానికి సీసీ రోడ్డు వెంటనే నిర్మించాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

బుట్టాయగూడెం: వాగులో చిక్కుకున్న లారీ

బుట్టాయగూడెం: సోమవారం ఉదయం నుండి కురిసిన భారీ వర్షానికి కొండవాగులు ఉప్పొంగాయి. మండలంలోని బెడదనూరు గ్రామం వెళ్లే దారిలో ఉన్న వాగులో సోమవారం ఒక లారీ చిక్కుకుపోయింది. రెడ్డిగణపవరం నుంచి బెడదనూరు వెళ్తున్న క్రమంలో వాగుపైన కాజ్‌వేపైకి వెళ్లేసరికి లారీ ఇంజన్ సెల్ఫ్ ఆగిపోయింది. ఆ సమయంలో వాగు పొంగుతుండటంతో వరద ఉధృతి తగ్గే వరకూ ఆగి తర్వాత ఆ లారీని అక్కడి నుంచి తరలించారు.

ప్రాణ, ఆస్తి నష్టాల్లేకుండా చర్యలు

అధికారులకు మంత్రి పార్థసారధి ఆదేశం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పరిస్థితిపై అధికారులకు మంత్రి పార్థసారధి ఫోన్ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్, మెడికల్, అగ్రికల్చర్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి అధికారులందరూ అప్రమత్తతో, సమన్వయంతో పని చేసి నష్ట నివారణా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎంతమేర నష్టం వాటిల్లిందో పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి

బుట్టాయిగూడెంలో తెల్లవారుజామున భారీ వర్షానికి పిడుగులు పడడంతో గ్రామంలోని దేవుడు మాన్యం సమీపంలో దిగమర్తి శ్రీనుకు చెందిన పొలంలో కట్టేసి ఉన్న రెండు ఆవులు అక్కడికక్కడే చనిపోయాయి. దీంతో ఆ రైతుకు రూ.50 వేల వరకూ నష్టం వాటిల్లింది. వారం రోజుల్లో ఈనడానికి సిద్ధంగా ఉన్న ఆవులు చనిపోయాయని శ్రీను కన్నీరుమున్నీరయ్యాడు. పిడుగుపాటుకు మృతి చెందిన ఆవులను రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పరిశీలించారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలో సోమవారం కురిసిన భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. తెల్లవారుజామున మొదలైన వర్షం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. ప్రజలు ఇంటి నుండి కాలు బయట పెట్టే పరిస్థితి లేకుండాపోయింది. వ్యాపార దుకాణాలన్నీ వెలవెలబోయాయి.

పిజిఆర్ఎస్ అర్జీలకు పారదర్శక పరిష్కారం

అందిన అర్జీలు 224: కలెక్టర్ కె.వెట్రిసెల్వి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

పిజిఆర్ఎస్ అర్జీలకు నాణ్యమైన, పారదర్శకమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లాస్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కరరావు, డిప్యూటీ కలెక్టర్ ఎల్.దేవకిదేవి, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, డిపిఒ కె.అనురాధ, సర్వే ఎడి అన్సారీ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు తమ శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోపుగానే పరిష్కారం చూపాలన్నారు. ఒక్కోసారి ఫిర్యాదు పరిష్కారానికి కొంత సమయం అవసరమైనప్పుడు ఆ విషయాన్ని ఫిర్యాదుదారులతో స్వయంగా అధికారులు మాట్లాడి చెప్పాలన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెనువెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలని, అర్జీలు రీఓపెన్ కాకుండా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

కొలువుదీరిన కొత్త ఉపాధ్యాయులు

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

2025 డిఎస్‌సికి ఎంపికైన ఉపాధ్యాయులంతా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్, జోన్-2 పోస్టులకు మొత్తం 1,146 మంది ఎంపికయ్యారు. వీరందరికీ సెప్టెంబర్ 25వ తేదీన అమరావతిలో సిఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఎంపికైన ఉపాధ్యాయులందరికీ అక్టోబర్ మూడో తేదీ నుంచి పదో తేదీ వరకూ శిక్షణ తరగతులు నిర్వహించి స్థానాలకు సంబంధించి కౌన్సిలింగ్ సైతం నిర్వహించారు. ఆయా స్కూల్స్‌కు ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులంతా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఏజెన్సీలోని స్కూల్స్‌లో ఖాళీ ఉన్న స్థానాల్లో నూతన ఉపాధ్యాయులు చేరారు. ఆలస్యమైతే సీన్సియార్టీ దెబ్బతింటుందన్న కారణంతో ఎంపికైన వారంతా సోమవారమే విధుల్లో చేరినట్లు తెలుస్తోంది.

'వేంపాడు' నుంచి తొలి ఉపాధ్యాయులు



ఏలూరు ప్రతినిధి: ద్వారకాతిరుమల మండలం వేంపాడు గ్రామంలో అరుదైన రికార్డు నమోదైంది. ఆగ్రామం ఏర్పడి తరాలు గడిచినా ఇప్పటి వరకూ ఆఊరు నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఒక్కరూ ఎంపిక కాలేదు. అలాంటి మారుమూల గ్రామం నుంచి 2025 డిఎస్‌సిలో దొప్పసాని సుజన, పరసా హరీష్ ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లుగా ఎంపికై అరుదైన ఘనత సాధించారు. ఉపాధ్యాయులుగా ఎంపికైన ఇద్దరు సోమవారం నిడమర్రు మండలం బువ్వనపల్లి హైస్కూల్‌లో సుజనా, కామవరపుకోట మండలం ఈస్ట్ యడవల్లి గ్రామంలోని హైస్కూల్‌లో హరీష్ ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టడంతో గ్రామస్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామం నుంచి తొలిసారిగా ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంపై గ్రామస్థులతోపాటు ఆయా కుటుంబాల్లోనూ ఆనందోత్సాహాలు వెల్లువెత్తున్నాయి. వేంపాడు గ్రామంలో దాదాపు రెండువేల వరకూ జనాభా ఉంటారు. మారుమూల గ్రామం. ప్రభుత్వ స్కూల్స్‌లో విద్యనభ్యసించిన దొప్పసాని రామకృష్ణ, విజయవరలక్ష్మిల కుమార్తె సుజనా, పరసా సత్యనారాయణ, లక్ష్మిల కుమారుడు హరీష్ ఇద్దరూ ఒకేసారి ఉపాధ్యాయ కొలువులు సాధించడంతో ఆగ్రామంలో ఎంతోమంది యువతకు స్ఫూర్తిగా నిలిచారు.

కుక్కునూరు : ఏజెన్సీ మండలమైన కుక్కునూరులోని ప్రభుత్వ పాఠశాలల్లో జూన్ నుంచి సుమారు 70 మంది ఉపాధ్యాయుల ఖాళీలు ఉండటంతో విద్యార్థులు గణనీయమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై తల్లిదండ్రులు, స్థానిక రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ధర్నాలు నిర్వహించి, జిల్లా అధికారులకు పత్రాలు సమర్పించారు. వారి నిరంతర కృషి ఫలితంగా మండలంలోని 70 ఖాళీ పోస్టులలో సోమవారం 66 మంది కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. మిగిలిన నలుగురు కూడా రెండు రోజుల్లో జాయిన్ అవుతారని విద్యాశాఖాధికారి కృష్ణప్రసాద్ తెలిపారు.

కుక్కునూరులో..

కొయ్యలగూడెం: మండ లంలో మొత్తం 14 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు మండల విద్యాశాఖాధికారి జె.సురేష్ బాబు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. నూతనంగా నియమితులైన వారిలో స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్ ఎడ్యుకేషన్) 6, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) ఇద్దరు, స్కూల్ అసిస్టెంట్ (హిందీ) 1, స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) 1, స్కూల్ అసిస్టెంట్ (మాథ్స్) 1, స్కూల్ అసిస్టెంట్ (సోషల్) 1, ఎస్‌జిటిలు ఇద్దరు ఉన్నారు. విధులు చేపట్టిన పాఠశాలలు ఈ విధంగా ఉన్నాయి. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల కుంతలగూడెం 3, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యర్రంపేట 3, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కన్నాపురం 2, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరింపూడి 2, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోడిగూడెం 1, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదాంతపురం 1, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కొయ్యలగూడెం 1, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శ్రీరంగపట్నం 1 చేరారు.

ముసునూరు : మండలంలో 16 గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యను బోధించేందుకు గాను ఈ సంవత్సరం మెగా డిఎస్‌సి 2025లో సెలెక్ట్ అయిన 8 మంది నూతన ఉపాధ్యాయులు ఆర్డర్ కాపీల ద్వారా జాయిన్ అయ్యారు. ఎంఇఒ-1 సుభాషిణి, ఉపాధ్యాయులు కొలకలూరి రాజు, భాస్కరరావు, గుడిమెళ్ల రాంబాబు, జి.పద్మ కిషోర్, సిఆర్‌పిలు, ఎంఆర్‌పిలు పాల్గొన్నారు.

భీమడోలు : మండలానికి డిఎస్‌సి-2025 ద్వారా కేటాయింపు జరిగిన నూతన ఉపాధ్యాయులు సోమవారం విధులలో చేరారని మండల విద్యాధికారి నెంబర్-1 శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు వీరు మల్లవరం, పూళ్ల-2, కొండ్రెడ్డి నగర్ ప్రాథమిక పాఠశాలలో బాధ్యతలను స్వీకరించారన్నారు.

ముదినేపల్లి : మండలంలో పదిమంది ఉపాధ్యాయులు విధుల్లోకి చేరారు. వీరంతా ఎంఇఒ-1 రామారావు చేతులమీదుగా జాయినింగ్ పత్రాలు అందుకున్నారు. ఎంఇఒ రామారావు మాట్లాడుతూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

ఏలూరు అర్బన్ : గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులకు ఎపిటిఎఫ్ నాయకులు స్వాగతం పలికారు. ఏలూరు నగర శాఖ ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎంవి.సుబ్బారావు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ఏలూరు అర్బన్: విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ ఏలూరులోని సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాల దశాబ్దాలుగా మంచి విద్యాసంస్థగా అనేక రంగాల్లో ప్రతిభావంతులను అందించిందన్నారు. ఇటీవల కాలంలో ఈ కళాశాల యాజమాన్యం విద్యార్థులపై అన్యాయమైన రుసుములు, నిబంధనలకు విరుద్ధమైన విధానాలు అమలు చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం యూనివర్సిటీ డిగ్రీ పరీక్ష ఫీజు ప్రభుత్వ కళాశాలలో రూ.900, ప్రయివేట్ కళాశాలల్లో రూ.1300 మాత్రమే ఉండగా, ఈ కళాశాలలో రూ.1900 మాత్రమే వసూలు చేస్తున్నారన్నారు. సప్లిమెంటరీ పరీక్షకు ఒక్కో పేపర్‌కు ఫీజు ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం రూ.250 అయినప్పటికీ, ఈ కళాశాలలో రూ.500 వసూలు చేస్తున్నారని తెలిపారు. బికామ్ విద్యార్థుల నుంచి రూ.ఆరు వేలు వసూలు చేసి ప్రభుత్వం ప్రారంభించిన ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించకుండా కాలేజీకి పరిమితం చేస్తున్నారని, యూనిఫాం, ఐడి కార్డు లేకపోయినా ఒక్కరోజుకు రూ.100 జరిమానా విధిస్తున్నారని, ఈ విధమైన భారాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత యాజమాన్యంపై తక్షణం చర్యలు తీసుకోవాలని, అదనంగా కట్టించుకున్న రుసుమును తిరిగి విద్యార్థులకు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంశీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో జరుగుతున్న ఐద్వా రాష్ట్ర మహాసభలో పాల్గొన్న ఏలూరు జిల్లా ప్రతినిధులు

సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పిజె అమృతం ఆధ్వర్యంలో సిపిఆర్‌పై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది చేత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ శోభ, డిపిహెచ్‌ఎన్‌ఒ జ్యోతి, వైద్య విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సత్రంపాడులోని సర్‌సిఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాలలో సిపిఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబివిఎస్.ప్రసాద్ మాట్లాడుతూ అక్టోబర్ 13 నుంచి 17 వరకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సిపిఆర్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ప్రతిరోజు సిపిఆర్‌పై అవగాహనను కళాశాల విద్యార్థులకు, సాధారణ ప్రజలకు కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సిఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఎ.నరేంద్రబాబు, ప్రొఫెసర్ ఎన్.శివరాం, అసోసియేట్ ప్రొఫెసర్ బి.కుమారస్వామి, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ వి.నాగరాజు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులు జాగ్రత్తలు పాటించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రిటైర్డ్ ఉద్యోగులను టార్గెట్ చేస్తూ సైబర్ నేరాళ్లు రెచ్చిపోతూ వారి జీవితకాలం సంపాదించిన సొమ్మును అపహరించేందుకు పథకాలు వేస్తున్నారని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు సైబర్ నేరాళ్ల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రతి సోమవారం పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ సోమవారం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ప్రజలు తమ సమస్యలను విన్నవించారు. అంతేకాకుండా ఏలూరు జిల్లా అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు కూడా ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ఎటువంటి సంఘటనలకైనా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడం గానీ, 1930 సైబర్ కంట్రోల్ సెల్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కారం

సబ్ కలెక్టర్ బి.వినూత్న

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజాసమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించడం జరుగుతుందని సబ్ కలెక్టర్ బి.వినూత్న తెలిపారు. నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగింది. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిర్దేశించిన సమయం లోపు అన్ని సమస్యలు పరిష్కరించటం జరుగుతుందన్నారు.

కల్తీ మద్యాన్ని అరికట్టాలి

వైసిపి ఆధ్వర్యాన ఎక్సైజ్ కార్యాలయాల వద్ద నిరసన, వినతి

ప్రజాశక్తి - భీమడోలు

కల్తీ మద్యాన్ని అరికట్టాలని కోరుతూ వైసిపి శ్రేణులు భీమడోలులో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమానికి ఆ పార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ బాధ్యులు కారుమూరి సునీల్‌కుమార్ నాయకత్వం వహించారు. తొలుత భీమడోలు జంక్షన్ నుంచి ర్యాలీగా బయలుదేరిన శ్రేణులు భీమడోలు ఎక్సైజ్ కార్యాలయంకు చేరుకొన్నారు. మద్యం పాలసీపై ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్లకార్డులు ధరించి నినాదాలు చేశారు. బెల్ట్ షాపులు అరికట్టాలని కోరారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయం వద్ద భీమడోలు సిఐ ఎస్.కళ్యాణికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమడోలు జెడ్‌పిటిసి తుమ్మగుంట భవానీరంగా, వైసిపి నాయకులు మాన్సింగ్, పసుపులేటి సత్యనారాయణ, ఆర్.నాగేశ్వరరావు, ఆల్తి శ్రీను, ఎం.జాన్సన్‌తో పాటు నియోజకవర్గ పరిధిలోని వైసిపికి చెందిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

చింతలపూడి : కల్తీ మద్యం, నకిలీ మందు తయారీ విధానాన్ని అరికట్టాలని చింతలపూడి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కంభం విజయ రాజు, మచిలీపట్నం పార్లమెంట్ ఇన్‌ఛార్జి జెట్టి గురునాథ్‌రావు అన్నారు. మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని జిల్లా మున్సిపల్ విభాగ అధ్యక్షులు బొడ్డు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చింతలపూడి నియోజకవర్గ నాలుగు మండలాల అధ్యక్షులు, నాయకులు చింతలపూడి టౌన్, జంగారెడ్డిగూడెం టౌన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ కార్యాలయంలో వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలవరం : కల్తీ మద్యం తయారుచేసి అమ్మడం ద్వారా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, దీనిపై సిబిఐ విచారణ చేపట్టాలని పోలవరం మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం వైసిపి మండల అధ్యక్షులు బుగ్గ మురళీకృష్ణ ఆధ్వర్యాన ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, జెడ్‌పిటిసి కలుం హేమ కుమారి, సోబ్బన్న మోహన్, తదితర పార్టీ శ్రేణులతో నిరసనగా ర్యాలీ చేసుకుంటూ ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఎక్సైజ్ సిఐ వీరబ్రహ్మంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ కల్తీ మద్యం వల్ల సామాన్య ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం ఆటాడుకుంటుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కల్తీ మద్యం కుటీర పరిశ్రమగా తయారు చేశారని ఎద్దేవ చేశారు. కల్తీ మద్యం పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కల్తీ మద్యం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, మరెంతోమంది అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల సామాన్యుల బతుకులు అతలాకుతలం అవుతున్నాయని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బదిరెడ్డి అప్పారావు, సుంకర కొండబాబు, మడకం సింగరాజు, కాసే ధనలక్ష్మి, పొడుం శ్యాం కుమార్, ఫాతిమా మునిషా బేగం, గోకా రామకృష్ణ, ఈర్నాల జాన్, చాన్ పాల్గొన్నారు.

భీమడోలులో..

చింతలపూడిలో..

పోలవరంలో..

ఏలూరు సిటీలో..

ఏలూరు సిటీ : రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం ఏరులై పారుతుందని, కల్తి మద్యాన్ని వెంటనే నిషేధించాలని ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ డిమాండ్ చేశారు. ఏలూరులోని గవరవరం సెంటెన్స్ డిగ్రీ కాలేజ్ వద్దగల రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ వారి కార్యాలయం వరకు వైసిపి నాయకులు ర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కల్తీ మద్యం తాగి ఎందరో ప్రాణాలు కోల్పోయారని, ప్రభుత్వం తక్షణమే కల్తీ మద్యం అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశీ శ్రీనివాస్, రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయి సుధీర్ బాబు, జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు చిరంజీవి పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం నందు సోమవారం వైసిపి ఆధ్వర్యాన నకిలీ మద్యాన్ని అరికట్టాలి, ప్రజల ప్రాణాలను కాపాడాలని నిరసన చేపట్టారు. అనంతరం ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నూజివీడు మాజీ ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ కల్తీ మద్యం దందాపై కూటమి ప్రభుత్వంలోని పెద్దలకు ఏమాత్రం సంబంధం లేనట్లయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణం సిబిఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. పంటలకు యూరియా అధికంగా వాడితే కేన్సర్ వస్తుందని చంద్రబాబు చెప్తున్నారు.. మరి ములకలచెరువు నకిలీ మద్యం తాగితే ఆరోగ్యం వస్తుందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దంత సమస్యల పట్ల అవగాహన పెంపొందాలి

- పుక్కిలి పట్టడం ఎంతో మేలు
- నోటిలో పిన్నీసులు, పెన్నులు పెట్టరాదు
- ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ దేవిశెట్టి దినేష్ బాబు

ప్రజాశక్తి - ముసునూరు

దంత సంరక్షణతో గుండె పదిలమని శ్రీభాను స్మైల్ దంత వైద్యశాల నిర్వహకులు, ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ దేవిశెట్టి దినేష్ బాబు అన్నారు. మండలంలోని రమణక్కపేట గ్రామంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీభాను స్మైల్ దంత వైద్యశాల ఆధ్వర్యాన ప్రజలకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ దేవిశెట్టి దినేష్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో తొలి దశలోనే దంతాల పరిరక్షణపై అవగాహన పెంపొందాలన్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రతి వ్యక్తి రెండు పర్యాయాలు దంత పరిశుభ్రత చేయడం ఎంతో అవసరమన్నారు. దంతాలను పరిశుభ్రం చేసుకునే విధానాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రదర్శించారు. దంతాల పరిరక్షణతో గుండె కూడా ఎంతో పదిలంగా ఉంటుందని సోదాహరణంగా వివరించారు. దంత సంబంధ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. ఆరోగ్యం పదిలంగా ఉంటేనే ప్రజలు తమ పనుల పట్ల శ్రద్ధ వహించటం జరుగుతుందన్నారు. ప్రధానంగా ప్రతి ఒక్కరూ ఆహారాన్ని నోటి నుండి తీసుకుంటామని, నోరు ఎంత పరిశుభ్రంగా ఉంటే అంత ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందనేది సామెతని.. నోరు ఆరోగ్యంగా ఉంటే పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారనేది ఆరోగ్య సూత్రంగా ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. వైద్యులు సూచిస్తున్న మేరకు దంత పరిశుభ్రత, దంత పరిరక్షణపై చిన్ననాటి నుండి శ్రద్ధ వహించాలన్నారు. నేటి చిన్నారులే తల్లిదండ్రులకు దంతాల పరిరక్షణపై అవగాహన కల్పించి, వారి ఆరోగ్యానికి దోహదపడాలన్నారు. నోటిలో పిన్నీసులు, పెన్నులు పెట్టడం వల్ల దంతాల పటిష్టత దెబ్బతింటుందన్నారు. మంచి ఆహారపు అలవాట్లు ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయన్నారు. చిన్నారులను పెడదారి పట్టించేందుకు సమాజంలో అనేకమంది ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారని, వాటికి దూరంగా క్రమశిక్షణతో ముందడుగు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రముఖులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న దంత వైద్యులు

వర్క్ అవుట్‌సోర్సింగ్ పేరుతో ప్రయివేటీకరణ తగదు

ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్యకు సిఐటియు బృందం వినతి

ఏలూరు అర్బన్: ఏలూరు నగరంలో 11, 30వ డివిజన్‌లలో వర్క్ అవుట్‌సోర్సింగ్ పేరుతో చేపట్టిన ప్రయివేటీకరణ విధానాన్ని నిలిపివేయాలని, ఆప్కాస్ ద్వారా మున్సిపల్ కార్మికుల నియామకాలను చేపట్టాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు జిల్లా కార్యదర్శి అంగులూరి జానుబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్యకు సిఐటియు ప్రతినిధి బృందం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జాన్‌బాబు మాట్లాడుతూ ఏలూరు నగరంలో మున్సిపల్ కార్మికుల కొరత ఉన్నదని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆప్కాస్ ద్వారా కార్మికుల నియామకాలను చేపట్టాలని కోరారు. రిటైర్ అయిన వారి స్థానంలో, సర్వీసులో ఉండగా చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని అన్నారు. ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి మున్సిపల్ పారిశుధ్య వ్యవస్థను అప్పగించడం వల్ల పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తమవుతుందని, మున్సిపాలిటీ నియంత్రణ కోల్పోతుందని తెలిపారు. కరోనా వైరస్ విజృంభించిన సమయంలో ఏలూరు నగరంలోని మున్సిపల్ కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు పారిశుధ్య సేవలను అందించారని వివరించారు. కాబట్టి మున్సిపల్ పారిశుధ్య పనుల ప్రయివేటీకరణ వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.ఇస్సాకు, జె.గోపి పాల్గొన్నారు.



వినతిని అందజేస్తున్న నాయకులు

డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్‌కు అంతర్జాతీయ పురస్కారం

కొయ్యలగూడెం : ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్‌కు అరుదైన గౌరవం లభించింది. సింగపూర్‌లోని గ్రాండ్ హయత్ వేదికగా ఈనెల 10, 11 తేదీలలో జరిగిన ఏషియా పిసిఆర్ 2025 అంతర్జాతీయ సదస్సులో ఆయనకు ఫెలోషిప్ అవార్డు ప్రదానం చేశారు. అంతర్జాతీయ కార్డియాలజీ రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని డాక్టర్ అశోక్ సెట్, మైకెల్ కాంగ్ ఇన్ లీ చేతుల మీదుగా అందుకున్నారు. సదస్సులో డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్ చేసిన సంక్లిష్ట హృదయ శస్త్రచికిత్సలు, అరుదైన కేసులు వివరించగా నిపుణుల ప్రశంసలు దక్కాయి. మన దేశం నుంచి అతి కొద్దిమందికి మాత్రమే లభించిన ఈ అంతర్జాతీయ గౌరవం తనకు లభించడం గర్వకారణమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్స్ హాస్పిటల్‌లో ఈ సంవత్సరం చేసిన అనేక కేసులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఆనందదాయకమన్నారు. మరింత అంకితభావంతో చేయడానికి ప్రేరణనిస్తుందని తెలిపారు.

స్త్రీ శక్తి పథకం విలీన మండలాలకు వర్తింపజేయాలి

జనసేన నాయకుల వినతి

కుక్కునూరు : కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు అందుబాటులో లేకపోవడంతో మహిళలు ఆర్థిక భారం ఎదుర్కొంటున్నారు. గతంలో రాజమండ్రి నుండి భద్రాచలం వరకు నడిచే ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సు సర్వీసుల స్థానంలో ప్రస్తుతం అల్ట్రా డీలక్స్ బస్సులు నడుస్తుండడంతో మహిళలు టికెట్ కోసం డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. ఈ సమస్యను జనసేన ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ నేతృత్వంలోని నాయకులు ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఎంఎల్‌ఎ విజయవాడ సౌత్ జోన్ ఆర్‌టిసి ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడితో చర్చించగా, విలీన మండలాల్లో ఇంటర్‌స్టేట్ సర్వీసులు నడుస్తున్నాయని, దీనికి ప్రభుత్వ జిఒ ఉందని తెలిపారు. అయితే భద్రాచలానికి సమీపంలోని ఎట్టపాక వరకు సర్వీసులు నడిపితే ఇంటర్‌స్టేట్ సమస్య తప్పుతుందని గోపాలకృష్ణ సూచించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంఎల్‌ఎ బాలరాజు విలీన మండలాలకు స్త్రీ శక్తి పథకం అమలు చేయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జనసేన నాయకులు పాల్గొన్నారు.

'బిసిలకు రక్షణ చట్టం అమలు చేయాలి'

టి.నరసాపురం : బిసిలకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ మంగళగిరి టిడిపి జాతీయ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా బిసిలకు రక్షణ చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు. గతంలో వైసిపి పాలనలో బిసిలపై ఏవిధంగా దాడులు జరిగాయో వివరించారు. బిసి రక్షణ చట్టం త్వరితగతిన అమల ంచేయాలని కోరగా ఆయన దానికి సానుకూలంగా స్పందించి బిసిలకు ఎల్లప్పుడూ టిడిపి అండగా వుంటుందని తెలిపినట్లు ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారని అన్నారు.

గవాయ్‌పై దాడికి కారకులను శిక్షించాలి

ఎంఆర్‌పిఎస్ నేతలు

దెందులూరు : సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్.గవాయ్ మీద దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని, వెంటనే అరెస్ట్ చేయాలని ఎంఆర్‌పిఎస్ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం కలెక్టరేట్ ముందు ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి, కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు. ముఖ్య అతిథులుగా ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు కందుల రమేష్ పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్.గవాయ్ మీద దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి కూడా శిక్ష పడే విధంగా స్వతంత్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఈసంపల్లి సిద్ధు, బిఎస్‌ఎన్‌ఎల్ వెంకటేశ్వరరావు, రుద్రయ్య, హైమావతి, రమేష్, పాముల యేసు, బిఆర్.చౌదరి పాల్గొన్నారు.

డ్రెయిన్లలో వ్యర్థాలే రోడ్ల ముంపునకు కారణం : ఎంఎల్‌ఎ

ఏలూరు సిటీ : ఏలూరు నగరంలో డ్రెయిన్లలో వేసే వ్యర్థాలే వర్షాల సమయంలో రోడ్ల ముంపునకు ప్రధాన కారణమని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ఇటువంటి పరిస్థితులు పదేపదే పునరావృతం కాకుండా ప్రజలు బాధ్యతతో వ్యవహరించి డ్రెయిన్లను పరిశుభ్రంగా ఉంచే విషయంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఏలూరు నగరంలోని పాత బస్టాండ్ మినీ బైపాస్ రోడ్‌లో ఉన్న దెయ్యాల తూము డ్రెయిన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను, వాటి కారణంగా నెమ్మదించిన నీటి ప్రవాహాన్ని ఎంఎల్‌ఎ బడేటి చంటి సోమవారం పరిశీలించారు. వ్యర్థాల తొలగింపును యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కార్పొరేషన్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఎడతెరిపి లేని వర్షాలతో నగరంలోని ప్రధాన వీధులు నీటమునగడానికి ప్రధాన కారణం కొంతమంది నగరవాసులు బాధ్యతారాహిత్యంగా డ్రెయిన్లలో వేసే ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాలేనని చెప్పారు. సోమవారం కూడా ఇదేపరిస్థితి పునరావృతం కావడంతో శాశ్వత చర్యలపై దృష్టిపెట్టామన్నారు. భవిష్యత్తులో ఈ పరిస్థితులు మళ్లీమళ్లీ తలెత్తకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఎంఎల్‌ఎ వెంట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు ఉన్నారు.

అసిస్టెంట్ కమిషనర్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు

ఏలూరు సిటీ : ఏలూరు నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా డి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ సిబ్బంది ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ భాను ప్రతాప్‌ను, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటిని, కోఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన గతంలో గుంటూరు మున్సిపల్ కమిషనర్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ గా పనిచేసి ఉద్యోగోన్నతిపై ఏలూరు నగరపాలక సంస్థకు అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి

వ్యకాస ఆధ్వర్యాన కలెక్టర్‌కు వినతి

ముదినేపల్లి : మండలంలోని వణుదుర్రు గ్రామ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు సోమవారం పిజిఆర్‌ఎస్‌లో మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి చిన్నం మాధవ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాధవ ముదినేపల్లిలో మాట్లాడుతూ గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. ఈ రోడ్లపై ప్రయాణం సాగించాలంటే గ్రామస్తులు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. అదేవిధంగా డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర అవస్తలు పడుతున్నట్లు తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం నాణ్యతగా లేవన్నారు. అన్నం సద్దవుతున్నట్లు తెలిపారు. అలాగే రేషన్ షాపుల ద్వారా ఇచ్చే సరుకులు పంచదార ఇస్తే కందిపప్పు ఇవ్వడం లేదని, కందిపప్పు ఇస్తే పంచదార ఇవ్వటం లేదన్నారు. బియ్యం కూడా మనిషికి ఐదు కేజీలు సరిపోవని మనిషికి పది కేజీలు ఇవ్వాలని కలెక్టర్ ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నట్లు మాధవ్ తెలిపారు.

30 వరకు 144 సెక్షన్ అమలు : ఎస్‌ఐ

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈనెల 13 నుంచి 30 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్‌ఐ వి. క్రాంతి కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా పోలీసుల అనుమతి లేకుండా ఐదుగురికి మించి ఉండకూడదని, ఎటువంటి సమావేశాలు, బహిరంగ ర్యాలీలు నిర్వహించరాదన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేరాలు - ఘోరాలు

ఐదుగురు ముద్దాయిలు అరెస్టు

చోరీ సొత్తు స్వాధీనం

వివరాలు వెల్లడించిన డిఎస్‌పి రవిచంద్ర

ప్రజాశక్తి - చింతలపూడి

చెడు అలవాట్లకు, సులభంగా డబ్బు సంపాదించాలి అనే ఆశతో చదువుకునే యువత దొంగతనానికి పాల్పడుతున్నారని జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర తెలిపారు. మండలంలోని సర్కిల్ కార్యాలయం వద్ద ఇటీవల దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు ముద్దాయిలను పట్టుకొని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన ఐదుగురు చదువుకుంటున్న యువకులు ఆన్‌లైన్ రమ్మీ, ఇతర చెడు వ్యసనాలకు బానిసలుగా మారారని, సెప్టెంబర్ 23న సాయంత్రం ధర్మాజీగూడెంలో ఒక్క కట్టు చెరువు రోడ్డు జామాయిల్ తోటలో ధర్మాజీగూడెం వెళ్లే దారిలో బొల్లా నాగలక్ష్మి బంగారం నాన్తాడు, నల్లపూసల గొలుసు బలవంతంగా లాక్కొని మోటార్ సైకిల్‌పై పారిపోయారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు వరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ పర్యవేక్షణలో డిఎస్‌పి రవిచంద్ర ఆదేశాల మేరకు సిఐ క్రాంతి కుమార్, ధర్మాజీగూడెం ఎస్‌ఐ వెంకన్న, చింతలపూడి ఎస్‌ఐ సతీష్, వారి సిబ్బందితో పైకేసు ముద్దాయిలను పట్టుకొని అరెస్ట్ చేసి, వారి వద్ద చోరీ సొత్తును రికవరీ చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ, వారు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూసుకోవాలని తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

ప్రయాణికులు సురక్షితం

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల కేంద్రంలోని కొత్త రామాలయం సమీపంలో సోమవారం ఒక కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. రాజమండ్రి నుంచి చర్ల వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. అయితే కారులో ప్రయాణిస్తున్న వారందరూ సురక్షితంగా బయటపడ్డారని, ఎలాంటి ప్రాణహాని జరగలేదని స్థానికులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అప్పుల బాధ తాళ్ల లేక పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఏలూరు ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని కత్తెప్ప వీధికి చెందిన పువ్వల వసంత్‌కుమార్(40) స్థానికంగా లారీలు కొని ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేసేవాడు. అతనికి భార్య, ఇద్దరు సంతానం కలరు. ఈ క్రమంలో ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారంలో భారీగా నష్టం వచ్చింది. దీంతో గత కొద్ది రోజులుగా అతను మనోవేదనకు గురవుతూ మద్యానికి బానిసయ్యాడు. చేసేదేమీ లేక ఈనెల 11వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను సోమవారం మృతిచెందాడు. ఈ మేరకు వన్ టౌన్ ఎస్‌ఐ మదీన భాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వికలాంగుడు మృతి

లభ్యం కాని ఆచూకీ

ఏలూరు స్పోర్ట్స్ : అంగవైకల్యం కలిగిన వ్యక్తి రైలు పట్టాలపై నడుస్తూ వెళుతున్న సమయంలో రైలు ఢీకొని అతను మృతిచెందాడు. ఈ ఘటన ఏలూరు వంతెన సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం అర్ధరాత్రి సమయంలో జూట్ మిల్ వంతెన సమీపం నుండి రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. వేగంగా వచ్చిన రైలు అతన్ని ఢీకొట్టింది. ఈ సమాచారాన్ని రైలు పైలెట్ రైల్వే పోలీసులకు అందించాడు. రైల్వే పోలీస్ సోమవారం ఉదయం ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి వద్ద వివరాలు ఏమి లభించలేదు. మృతుడు 45 నుండి 50 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని, టీ షర్టు, ప్యాంటు ధరించి ఉన్నాడని, ఒక కన్ను పూర్తిగా అతనికి పనిచేయడం లేదని, ఒక చెయ్యి సగమే ఉందని రైల్వే పోలీసులు తెలుపుతున్నారు. వివరాలు తెలిసినవారు ఏలూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

5 కార్లు, 1 బైకు, 12 మంది జూదరులు అరెస్టు

ఉంగుటూరు : పోలవరం కాలువ గట్లు సమీపం కంసాలిగుంటలో ఓ గెస్ట్ హౌస్‌లో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. పక్కా సమాచారంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో నిడమర్రు సిఐ ఆధ్వర్యంలో చేబ్రోలు పోలీసులు ఈ దాడి నిర్వహించారు. 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. 5 కార్లు, 1 బైకుతో రూ.16,130 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మామిడాల సూర్యభగవాన్ వెల్లడించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పంట దిగుబడులపై రైతులకు అవగాహన

దెందులూరు : వ్యవసాయ కళాశాల రాజమహేంద్రవరం విద్యార్థులు దెందులూరు గ్రామంలో గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తులనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గ్రామ సమస్యలని పంట కాల్వలు, గ్రామ పటాన్ని, పంట దిగుబడులను రైతులకు వివరించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణి కుమార్ పాల్గొన్నారు.

పేరు మార్పు

చామన ఝాన్సీ (పాతపేరు), భర్త: సత్యనారాయణ గతంలో పిలిచే పేరు **చామన ఝాన్సీ లక్ష్మి** (కొత్తపేరు) డోర్ నెం: 5-79/A, రామాలయం వీధి, పెనుమంచిలి, ఆచంట మండలం, ప॥గో॥జిల్లా, **చామన ఝాన్సీ లక్ష్మి** (కొత్తపేరు) ఇక నుండి (కొత్తపేరు) ను **చామన ఝాన్సీ లక్ష్మి** ను అన్ని వ్యవహారాలలో వ్యవహరించవల్సిందిగా కోరుచున్నాను.

డాక్యుమెంట్స్ పోయినవి

మైల విశాలాక్షి అను నేను పశ్చిమగోదావరి జిల్లా, నర్సాపురం పట్టణము నందు ది. 10-08-2021 వ తేదీన, మోటారు సైకిల్ పై వెళుతుండగా ICICI నర్సాపురం, SBI రాయపేట కు చెందిన నా బ్యాంకు పాస్‌బుక్స్ మరియు చెక్‌బుక్స్ (ICICI నెంబర్ 000121-000130, 000110-000120, 000131-000140, SBI నెంబర్ 632060-632080), మరియు నా భర్త మైల రాజమోహన్ రావు గారి సర్వీస్ బుక్ పడిపోయినవి. అవి ఎంత వెతికినను దొరకలేదు. నాకు సంబంధించిన బ్యాంకుబుక్స్, చెక్‌బుక్స్ మరియు సర్వీస్ బుక్ దొరికినవారు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు. తగిన పారితోషికం అందించబడుతుంది. వీటిని ఉపయోగించి ఎటువంటి లావాదేవీలు జరిపినను, జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.

మైల విశాలాక్షి
రుస్తుంబాద, నర్సాపురం,
సెల్ నెం. 80199 53144

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం, వల్లూరు గ్రామానికి చెందిన, కుసుమే మహాలక్ష్మి, భర్త : వెంకటేశ్వర్లు అను నేను నా యొక్క పాస్‌పోర్ట్ పడిపోయింది. నా యొక్క పాస్‌పోర్ట్ నెంబర్ **W8080840** గల పాస్‌పోర్ట్ తో వల్లూరు ఇంటి దగ్గర నుండి ఆచంట సెంటర్ కు వెళుతుండగా, నా యొక్క పాస్‌పోర్ట్ పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

కుసుమే మహాలక్ష్మి
భర్త: వెంకటేశ్వర్లు
కుసుమే వారి పేట, వల్లూరు,
ఆచంట మండలం, ప॥గో॥జిల్లా
సెల్: 95422 53625

పబ్లిక్ నోటీసు

కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : కందుకూరు
O.S 60/2018

కాళే రవికుమార్ ....వాది
మరియు
పాలడుగు సుబ్బారావు ఇతరుల 18 ...ప్రతివాదులు

పై తెలిపిన దావాలో **1) బొచ్చు వీరాంజనేయులు (7వ ప్రతివాది),** తండ్రి: మధువెరి, వయస్సు 53 సంవత్సరములు, మేనేజింగ్ డైరెక్టర్ **శ్రీ వీర వివేక క్రియేటివ్ ఆగ్రో ఫారమ్స్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్,** డోర్ నెం.11-67, స్వాంతనాపురం పోస్ట్ & విలేజ్ - 521328 కొనుదవ మండలం, కృష్ణా జిల్లా, **2) ముద్దుల వీర వెంకట నాగ గవర్రాజు (10 వ ప్రతివాది),** తండ్రి: శ్రీనాథ్ బాబు, హిందూ వయస్సు 44 సంవత్సరములు డోర్ నెంబర్.5-267, వెంకటరమణ థియేటర్ వద్ద, కొత్తపేట - 534260 చాగల్లు గ్రామము & మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, **3) ధూళిపాటి గిరిజ (12 వ ప్రతివాది),** భర్త: చావలి వెంకట నాగరాజు వయసు 33 సంవత్సరాలు, రైల్వే కోటర్స్, 801/1 వించిపేట - 520002, విజయవాడ కృష్ణా జిల్లా / ఎన్టీఆర్ జిల్లా, **4) ఖాజా శంకర్ రావు (13వ ప్రతివాది),** తండ్రి: సాంబశివరావు, వయసు 56 సంవత్సరంలు, డోర్ నెంబర్-1-148, కొలనుకొండ గ్రామము, పిన్ కోడ్ - 522502, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా, **5) సిద్దినేని అనూష (14వ ప్రతివాది),** భర్త: నరేష్ తేజ్ దీప్, హిందూ వయసు 32 సంవత్సరాలు, డోర్ నెంబర్ 41-21/1-5, మూడవ లైన్, భ్రమరాంబ పురం, కృష్ణలంక, విజయవాడ-520013, కృష్ణాజిల్లా/ఎన్టీఆర్ జిల్లా, **6) కొత్త కీర్తి (15వ ప్రతివాది),** భర్త: సతీష్ బాబు, హిందూ 29 సంవత్సరాలు డోర్ నెంబర్ 67-1-36/9, దర్శిపేట, 2 పటమట, విజయవాడ టౌన్ - 52002, కృష్ణ ఎన్టీఆర్ జిల్లా. **7) ఇరకం జయచంద్ర (17వ ప్రతివాది),** తండ్రి: చంద్రయ్య, హిందూ డోర్ నెంబర్. సి2-124, DRDL కాలనీ, పినాకిని నగర్, సూళ్లూరుపేట పోస్ట్ & విలేజ్ - 524121, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, అనువారు ప్రతివాదులుగా ఉండి కోర్టు నోటీసులు తీసుకొనుటకు నిరాకరించి తప్పుడు సమాచారంతో తిప్పి పంపుతుండగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ పబ్లికేషన్ నోటీసును వేయటం అయినది.

ముఖ్యముగా తెలుపుట ఏమనగా పై డిక్లరేషన్ దావా మీ హాజరు నిమిత్తము **తేది.27-10-2025** గా కోర్టు వారు వాయిదా వేసి ఉన్నారు. కావున ఆ దినమున 10.30కు మీరు స్వయంగా గాని లేదా లాయర్ ద్వారా గాని హాజరుఅయి సంజాయిషి చెప్పుకొననియెడల శ్రీ కోర్టు వారు పై దావాను మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

ఇట్లు :**ముదివర్తి రాజారామ్,**
ఒంగోలు. **ముదివర్తి రాజ్యాలక్ష్మి,** అడ్వకేట్స్,
తేది: 13-10-2025 ఒంగోలు, సెల్ :9440183051

ప్రకటన

మహారాజశ్రీ 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) నూజివీడు వారి కోర్టులో
FDIA No. 100/2024 in O.S.No.44/2022
Between:
వేల్పూరి రమాదేవి వగైరాలు ...పిటిషనర్స్/వాదులు
మరియు
తాడిశెట్టి కోటయ్య @ కోటేశ్వరరావు వగైరాలు ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు
To:
R-2: తాడిశెట్టి వెంకన్న, తండ్రి: తాడిశెట్టి కోటయ్య @ కోటేశ్వరరావు, 26 సం॥లు, ఈదర గ్రామం, అగిరిపల్లి మండలం, కృష్ణాజిల్లా (ప్రస్తుత ఏలూరు జిల్లా)

పై నెంబరు గ్రంథంలో పిటీషనర్స్/వాదులు దావా షెడ్యూలు భూములను అయిదు భాగములుగా విభజించి, అందు 2 భాగములను పిటీషనర్స్/వాదులకు కేటాయించ వలసినదిగా శ్రీ కోర్టు వారు ది. 12-04-2022 వ తేదిన ప్రిలిమినరీ డిక్రీని Pass చేసినారు. దర్మిలా సదరు ప్రిలిమినరీ డిక్రీ నిబంధనల ప్రకారం ఫైనల్ డిక్రీ Pass చేయించవలసిందిగా పిటీషనర్స్/వాదులు పై గ్రంధమును దాఖలు చేసినారు. సదరు ఫైనల్ డిక్రీ నోటీసులు మీరు అందుకొనక, కాలయాపన చేయుచున్నందున, ఈ పేపరు ప్రకటన ద్వారా అమలు జరుపమని శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసినందున, మీరు ది. 27-10-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేక మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. లేని ఎడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున సదరు కేసును తీర్మానించుదురు.

వాయిదా తేది: 27-10-2025
(కోర్టు వారి order ప్రకారం)

మట్టా విద్యార్థి
కగ్గా ఏడుకొండలరావు
నూజివీడు అడ్వకేట్స్, నూజివీడు
ది. 13-10-2025 సెల్: 93935 11290
63002 65238